## క్లుప్తంగా

### అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ఆశీర్వచనం అందుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు. ఆయన వెంట జేసీఎస్ కన్వీనర్ లంక సత్తిబాబు, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్ర వరహానరసింహం, ఎస్.అప్పారావు తదితరులు ఉన్నారు.

### వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు రామానుజమ్

**సింహాచలం:** పెందుర్తి వెంకటాద్రిపై కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన నిర్వహించారు. విశేష అభిషేకాలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం కావడంతో భక్తులతో వెంకటాద్రి కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు.

### ఆలయ నిర్మాణానికి రూ.20 వేల విరాళం



శ్రీకృష్ణాలయం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న సీతారామయ్య

**పరవాడ:** మండలంలోని నాయుడుపాలెం శివారు గొల్లపేటలో శ్రీ కృష్ణాలయం నిర్మాణానికి శనివారం గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య రూ.20 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సోమునాయుడు, ఎస్.అశోక్, నరిసింగరావు, నరేష్ పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రసాద్

**సింహాచలం:** అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పెందుర్తి మండలంలోని సరిపల్లి, నీలకఠపురం, గుర్రంపాలెంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, పెన్సిళ్లు, జామెంటరీ బాక్స్‌లు పంపిణీ చేశారు. 500 మంది విద్యార్థులకు అక్షరభారతి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జేసీబీ ప్రసాద్ అందజేశారు. అలాగే సరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకునే 10 మంది విద్యార్థులకు రూ. 10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు కూడా వచ్చే ఏడాది నుంచి అందించనున్నట్టు ప్రసాద్ ప్రకటించారు.

### 18న మెగా జాబ్ మేళా

**గాజువాక:** వివిధ కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం స్థానిక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, విశాఖ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, వరుణ్ మోటార్స్, బీమా జ్యువల్స్, అపోలో ఫార్మసీ, ట్రిన్ దాబా తదితర కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు విశాఖ, నక్కపల్లి, గాజువాక, విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్ మెకానికల్, మెకానికల్ డిప్లమా, ఐటీఐ ఫిట్టర్, డీజిల్ మెకానిక్, బీ, డీ, ఎం ఫార్మసీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు.



# అక్కసుతోనే అనుచిత వ్యాఖ్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

- చంద్రబాబు, పవన్‌లకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

**సబ్బవరం:** సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేరవేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. అది చూసి ఓర్వ లేక టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అదీప్‌రాజ్ మండిపడ్డారు. మండలంలోని మొగలిపురంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఐడీ బాబు అధ్యక్షతన శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామ వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా పోల్చడం టీడీపీ, జనసేన పార్టీల దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సేవలు అందించారన్నారు. వలంటీర్ వ్యవస్థను కోర్టులకు వెళ్లి అయినా రద్దు చేయిస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారని, దాని వల్ల ప్రజలు ఇబ్బంది పడతారు తప్ప పవన్, చంద్రబాబుకు పోయేది ఏమీ లేదన్నారు. ఇటువంటి వారికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము,తహసీల్దార్ సత్యనారాయణ,జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, నాయకులు మోపాడ అప్పారావు,శరగడం రాము,బోను గంగునాయుడు, బంతికోళ్ల పద్మ పాల్గొన్నారు.

**'జగనన్న సురక్ష'తో సత్వర న్యాయం**

**సింహాచలం:** అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు సత్వరమే 11 రకాల సర్టిఫి కెట్లు అందించేందుకు జగనన్న సురక్ష కార్య క్రమం లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పలు కారణాల వల్ల అందుకోలేని వారిని గుర్తించేందుకు జగనన్న సరక్ష కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను వర్గాలు, కులాలు, పార్టీలు, మతాలకు అతీతంగా అందించి చరిత్ర సృష్టించారన్నారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో 94వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, పార్టీనాయకులు మనలత జోబ్ దాస్, యతిరాజుల నాగేశ్వరరావు, తామర్ల నర్సింగ్, సూరిశెట్టి సూరిబాబు, రామకృష్ణ, వర్మ, శంకర్, జోన్-8 జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ జయరామ్, యూసీడీ ఏపీడీ శ్రీరామ్, వర్క్స్ డీఈ విజయ్ కుమార్, ఏఈ రాధిక పాల్గొన్నారు.



వేపగుంటలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



హాజరైన లబ్ధిదారులు, ప్రజలు

## మహిళా మార్టులతో అతివలకు చేయూత

సెర్ప్ సీఈవో ఇంతియాజ్

**సబ్బవరం:** మహిళా మార్ట్‌ల ద్వారా మహిళలకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కలిసి సబ్బవరంలో రూ.35 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. మహిళా మార్ట్‌లో తక్కువ ధరకు నాణ్యమైన కిరాణా,ఫ్యాన్సీ వస్తువులు లభిస్తాయని తెలిపారు. పలు బ్రాండెడ్ కంపెనీలకు చెందిన సరకులు అందుబాటు ధరలో లభిస్తాయన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 32 వరకూ మార్ట్‌లను ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగిందన్నారు.అవన్నీ సత్ఫలితాలు ఇవ్వడంతో మరిన్ని మార్ట్‌లు అందుబాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు,స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ కేవీ నాంచారయ్య, ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. లక్ష్మీపతి, సెర్ప్ అడిసినల్ డైరెక్టర్ ఎం. మహిత, డీజీఎం ఫైనాన్స్ ఈ .కేశవ, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న సెర్ప్ సీఈవో ఇంతియాజ్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

## ఘనంగా హెచ్‌పీసీఎల్ ఆవిర్భావ దినోత్సవం



గ్యాస్ సరఫరా బాయ్‌కి మొక్క అందజేస్తున్న మహేష్‌రామ్

**సింహాచలం:** కరోనా సమయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా చేయడంలో డెలివరీ బాయ్స్ ప్రధాన పాత్ర పోషించారని హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ మహేష్‌రామ్ కొనియాడారు. హెచ్‌పీసీఎల్ 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని 94వవార్డు వేపగుంటలోని సత్యమహాలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌రామ్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ 49ఏళ్లు పూర్తి చేసుకుని 50వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ గొడౌన్ ఆవరణలో మొక్కలు నాటారు. డెలివరీ బాయ్స్‌కు మొక్కలు అందజేశారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎల్‌పీజీ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అన్నవరపు సుందరవదన్, డిప్యూటీ సేల్స్ మేనేజర్ మురళీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్స్) ప్రేమ్‌కుమార్ జ్యోతి, చీఫ్ మేనేజర్ సంజయ్‌కుమార్, ఏరియా సేల్స్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉద యం 9.30 నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

**ఘనంగా గరుడసేవ**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడ సేవ ఘనంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

## నైపుణ్యం ఉంటేనే ఉపాధి అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న గొర్లె రామునాయుడు

**సింహాచలం:** నైపుణ్యంతోనే యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కైట్స్ కంప్యూటర్ సంస్థ ఎండీ గొర్లె రామునాయుడు అన్నారు. పెందుర్తి కైట్స్ బ్రాంచిలో శనివారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ నేడు స్కిల్ కోర్సులు నేర్చుకునేందుకు యువత ఎక్కువగా ఆసక్తి చూపుతోందన్నారు. సెంటర్ హెడ్ ఎస్. జ్యోతి మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలు పెంచడానికి ప్రధాని నరేంద్రమోదీ పలు స్కిల్ ప్రాజెక్టులు ప్రారంభించారని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనె శ్రీధర్, ఉపాధ్యాయులు పెన్నం రమేష్, సావిత్రి, శేషగిరి,బంగారి, లోవకుమార్ పాల్గొన్నారు.

# సంక్షేమ సారథి సీఎం జగన్

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అక్కిరెడ్డిపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

**సింహాచలం:** ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెందుర్తి మండలంలోని అక్కిరెడ్డిపాలెం 292 సచివాలయం పరిధిలో శనివారం ఎమ్మెల్యే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమపథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమపథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. 95శాతానికి పైగా హామీలు నెరవేర్చి దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, పార్టీ మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, సర్పంచ్ ఉగ్గిన గోవింద్, పార్టీ నాయకులు సుకవాసి సతీష్, అక్కిరెడ్డి వెంకటరమణ, గొర్లె రామునాయుడు, ఉగ్గిన నాగార్జున, చింతకాయల ముత్యాలు, పెద్దిశెట్టి శేఖర్, నందవరపు శ్రీను, ఎంపీడీవో వసంత, ఈవోఆర్‌డీ అప్పారావు, వెలుగు ఏపీఎం రమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

**తాటిచెట్లపాలెం:** ప్రేమించిన యువతి కాదనడంతో యువకుడు గురువారం పెందుర్తి వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ..పెందుర్తి మండలం గంగమ్మపేట గ్రామానికి చెందిన సోర్నపూడి చరణ్‌కుమార్(21) గోపాలపట్నంకు చెందిన యువతిని ప్రేమించాడు. ఇతని తండ్రి చిన్నప్పుడే చనిపోగా తల్లి రాము పెంచి డిప్లమో వరకూ చదివించింది. సదరు యువతి వేరే ప్రాంతంలో ఉద్యోగం చేసుకుంటుంది. తరచూ ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించడం, ఆమె సమాధానం ఇవ్వకపోవడంతో ఈనెల 12వ తేదీన చరణ్‌కుమార్ తన తల్లిని తీసుకుని ఆ యువతి ఇంటికి వెళ్లి ఆమె తల్లిదండ్రులతో వాదోపవాదాలు చేయగా, యువతి తల్లిదండ్రులు గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే చరణ్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. మరుసటిరోజు 13వ తేదీన చరణ్ పెందుర్తి సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వైద్యులు, ఏఎన్‌ఎంలతో డీఎంహెచ్‌వోజగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మహారాణిపేట:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి( డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం సీజనల్ వ్యాధులపై ఏఎన్‌ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షా కాలం నేపథ్యంలో వర్షాలు విస్తరంగా కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో వైద్యులు, ఏఎన్‌ఎంలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నేషనల్ ఫీవర్ హెల్త్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సర్వే చేసి వివరాలను యాప్స్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ విషయంలో ఏఎన్‌ఎంలు, వైద్యులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు డాక్టర్ సత్యవేణి, డాక్టర్ సమత, నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, వివిధ ప్రొగ్రాంల అధికారులు పాల్గొన్నారు.

## ఎంవీపీ రైతు బజారులో బియ్యం కౌంటర్ ప్రారంభం



వినియోగదారుడికి బియ్యం అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

**ఆరిలోవ:** ఎంవీపీ రైతు బజారులో బియ్యం, కంది పప్పు కౌంటర్ అందుబాటులోకి వచ్చింది. జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథన్ శనివారం ఈ కౌంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బయట మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు ఎక్కువగా ఉండటంతో, వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతుబజారులో సరసమైన ధరలకు వాటిని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు, మిల్లర్లతో సంప్రదింపులు జరిపి, కౌంటరు అందుబాటులోకి తీసుకొచ్చి నట్లు తెలిపారు. ఇక్కడ బియ్యం ఫైన్ వెరైటీ బీపీటీ సన్నాలు కిలో రూ.46కి, దేశవాళీ రకం కందిపప్పు కిలో రూ.137కి విక్రయిస్తారని తెలియజేశారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. బయట మార్కెట్‌లో వాటి ధరలు తగ్గేంతవరకు రైతు బజార్‌లో కౌంటర్ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్, రైతు బజార్ ఈవో జి.ప్రసాద్, సహాయకుడు జి.కనకరాజు, బియ్యం హోల్‌సేల్ వ్యాపారులు పాల్గొన్నారు.

## ఐక్య ఉద్యమంతో ఉక్కు పరిరక్షణ

**కూర్మన్నపాలెం:** ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో దేశ ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 884వ రోజుకు చేరుకున్నాయి. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. దాన్ని కార్మిక వర్గం ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు.

## రద్దీ సమయాల్లో డ్రైవింగ్ స్కూల్ వాహనాలు నడపొద్దు



డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులకు సూచనలిస్తున్న సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రమేష్

**సింహాచలం:** ట్రాఫిక్ రద్దీ సమయాల్లో డ్రైవింగ్ స్కూల్ వాహనాల ద్వారా శిక్షణ ఇవ్వొద్దని ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులకు సూచించారు. పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శనివారం డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులతో సీఐ సమావేశమయ్యారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో డ్రైవింగ్ స్కూల్ వావానాలు రోడ్లపైకి రావడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఈవిషయాన్ని అర్థం చేసుకుని రద్దీ లేని సమయాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే పరిస్థితులు తీసుకొస్తే అపరాధ రుసంతోపాటు వెహికల్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.